సాక్షి
వనపర్తి
శనివారం । 30 । డిసెంబర్ । 2023



పొగమంచుతో ప్రమాదం

పొగమంచు కారణంగా లారీ, డీసీఎం, కారు ఢీకొన్న ఘటన హైవేపై చోటుచేసుకుంది.

వివరాలు 10లో ▸



ఉత్సాహంగా నృత్యోత్సవం

పాలమూరులో జరిగిన నృత్యోత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.6 /14.3

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఈ-చలాన్ డ్రైవ్

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఈ-చలాన్‌పై రాయితీ ప్రకటించిన నేపథ్యంలో వాహనదారుల నుంచి స్పందన వస్తోంది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 11,433 కేసులకు సంబంధించి రూ.14,28,940 పెండింగ్ చలాన్ డబ్బులు చెల్లించారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటి వరకు 35,977 ఈ-చలాన్ కేసులలో మొత్తం రూ.46,20,315 నగదు వచ్చినట్లయింది. ఇక నారాయణపేట జిల్లాలో 1,888 కేసులకు సంబంధించి రూ.3,38,785, నాగర్‌కర్నూల్‌లో 3,225 కేసులకు గాను రూ. 5,84,060, వనపర్తిలో 4,388 కేసులకు గాను రూ.7,05,845, గద్వాలలో 3,710 కేసులలో రూ.8,49,495 పెండింగ్ నగదు చెల్లించారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన అదనపు కలెక్టర్



వనపర్తి: ఇటీవల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సంచిత్ గంగ్వార్ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీతను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

చెరుకు డబ్బులు ఖాతాలో జమచేయాలి



ఆత్మకూర్: కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 13 ఏళ్లుగా చెరుకు సాగు చేస్తున్నామని.. యాజమాన్యం చెరుకు విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో 30 రోజుల్లోగా డబ్బులు జమ చేయాలని కృష్ణవేణి చెరుకు రైతుసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. శుక్రవారం జూరాల ప్రాజెక్టు వద్ద చెరుకు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎకరాకు రెండున్నర టన్నుల విత్తనం, రూ.10 వేలు పెట్టుబడి సాయం అందించాలని, సీడీసీ నిధులతో రహదారి మరమ్మతులు చేపట్టాలని, చెరుకు కటింగ్, ట్రాన్స్‌పోర్టుపోను మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. వేరుపురుగు సోకి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు ఇవ్వాలని, అధిక దిగుబడులు వచ్చే విత్తనాలను ఇవ్వాలని, చెరుకు పంట రవాణా సమయంలో ప్రమాదాలకు ఫ్యాక్టరీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, డ్రిప్ పరికరాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు వాసారెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి శివుడు, నాయకులు తిరుపతయ్య, నారాయణ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు.. సంకటం!

జూరాల కాల్వలకు మరమ్మతు కరువు



జూరాల ప్రధాన ఎడమ కాల్వ ముందు భాగం

- ప్రధాన ఎడమకాల్వ వెంట పెచ్చులూడుతున్న లైనింగ్
- సాగునీరు ముందుకు పారని వైనం
- పట్టించుకోని అధికారులు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ వెంట లైనింగ్ పెచ్చులూడి రంధ్రాలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. యాసంగిలో ఆయకట్టుకు సాగునీరును ఇవ్వకుండా క్రాప్ హాలీడేగా ప్రకటించిన ప్రభుత్వం వర్షాకాలం రాకముందే కాల్వ వెంట మరమ్మతులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వేసవిలోనే పూర్తి చేసి ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు ఇవ్వాల్సిన ప్రాజెక్టు అధికారులు ఇప్పటి వరకు వాటి మరమ్మతులను గాలికొదిలేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఆత్మకూర్ శివారు వరకు ఉన్న ఎడమకాల్వ ఎనిమిది చోట్ల దెబ్బతింది. ప్రాజెక్టు సమీపంలోని సమస్యలను గుర్తించలేని అధికారులు.. వీపనగండ్ల వరకు ఉన్న ప్రధాన కాల్వ వెంట సమస్యలు ఎలా గుర్తిస్తారో అర్థం కావడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. రెండేళ్ల కిందట రూ.50 లక్షలతో డి–6 కాల్వ మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గతేడాది వేసవిలోనే పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇప్పటికీ ఆత్మకూర్ మండలం ఆరేపల్లి, కత్తేపల్లిలో రెండు ప్రధాన పనులు నిలిచిపోయాయి. వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారోనని రైతులు ఎదురుచూసే పరిస్థితులు దాపురించాయి.

ఆయకట్టు ఇలా..

జూరాల ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం 85 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. జిల్లాలోని అమరచింత మండలం నుంచి ఆత్మకూర్, మదనాపురం, పెబ్బేర్, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల మీదుగా సుమారు 75 కిలోమీటర్ల మేర కాల్వ విస్తరించి ఉంది. చివరి ఆయకట్టు వీపనగండ్లలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ వరకు సాగునీటిని ఎడమకాల్వ వెంటే విడుదల చేస్తారు.

మరమ్మతులు చేపట్టాలి..



జూరాల ప్రధాన ఎడమకాల్వకు రెండేళ్లుగా మరమ్మతులు చేపట్టడం లేదు. కాల్వ వెంట ఉన్న రంధ్రాలను పూడ్చడంతో పాటు లైనింగ్ దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి త్వరితగతిన బాగు చేయించాలి. పూడికతీత, ముళ్లపొదలు తొలగించే పనులు కూడా చేపట్టాలి.

– సుధాకర్, రైతు, మూలమళ్ల

ప్రతిపాదనలు పంపుతున్నాం..



జూరాల ప్రధాన ఎడమ కాల్వకు ఏర్పడ్డ రంధ్రాలను గుర్తించి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని గతేడాది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అప్పుడప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నాం. కాల్వ వెంట ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు



నందిమళ్ల శివారులో కాల్వ దుస్థితి

ఆరు కిలోమీటర్లు.. ఎనిమిది రంధ్రాలు..

జూరాల ప్రాజెక్టు నుంచి మూలమళ్ల, ఆత్మకూర్ శివారు వరకు ఎనిమిది ప్రాంతాల్లో కాల్వ దెబ్బతింది. వీటి మరమ్మతులు చేపట్టకపోతే ఈసారి వచ్చే వరదల తాకిడికి కాల్వ లైనింగ్ పెచ్చులూడి పూర్తిగా దెబ్బతిని గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు మరోసారి కాల్వను పరిశీలించి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని కోరుతున్నారు.



మూలమళ్ల శివారులో..

క్రీడలతో మానసికోల్లాసం

- వైస్ చాన్స్‌లర్ డా. జి.నీరజ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ డా. నీరజ

కొత్తకోట రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి మానసికోల్లాసాన్ని పెంపొందించుకోవాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా. నీరజ సూచించారు. శుక్రవారం పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో విద్యార్థుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని.. ఒత్తిడి లేని చదువులతో బాగా రాణించవచ్చన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్‌ఫేర్‌ను ఆమెతో పాటు అధ్యాపక బృందం తిలకించారు. సాయంత్రం విజేతలకు వైస్ చాన్స్‌లర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా. డి.విజయ, కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య, ఎస్టేట్ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, ఓఎస్‌ఏ డా. షహనాజ్, డా. జె.శంకరస్వామి, డా. గౌతమి, డా. విద్య, డా. శ్రీనివాస్, చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

వనపర్తి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం శనివారం జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని.. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ కేసులను ఇరువర్గాలు రాజీమార్గాన త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉపయోపడుతుందని, సివిల్, క్రిమినల్, మోటారు వాహనాలకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ-కేవైసీ పరేషాన్



కొత్తకోటలోని వంటగ్యాస్ ఏజెన్సీ వద్ద గుమిగూడిన మహిళలు

- వంటగ్యాస్ దుకాణాల వద్ద వినియోగదారుల బారులు
- రూ.500 పథకానికి అనుసంధానం తప్పనిసరని సామాజిక మధ్యమాల్లో ప్రచారం
- ఇప్పుడే అవసరం లేదంటున్న అధికారులు

మదనాపురం: కొన్నిరోజులుగా వంటగ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ కోసం గ్యాస్ మంజూరు పత్రం, ఆధార్‌కార్డుతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకానికి ఈ-కేవైసీ చేయించుకోవాలని సామాజిక మధ్యామాల్లో ప్రచారం జోరుగా సాగుతుండటంతో వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే మహాలక్ష్మి పథకానికి సంబంధించి ఎలాంటి విధి విధానాలు ఖరారు కాలేదని.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నమ్మవద్దని, అవసరం లేదని నిర్వాహకులు ఎంత చెబుతున్నా వినిపించుకోవడం లేదు. పౌరసంబంధాలశాఖ అధికార సైతం ఇదే చెబుతోంది. అయినా వినియోగదారులు దుకాణాల ఎదుట బారులు తీరుతుండటంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ఈ-కేవైసీ చేద్దామంటే సర్వర్ వేధిస్తుండటం మరో సమస్యగా మారింది.

'ఉజ్వల' లబ్ధిదారుల నుంచి..

కేంద్రంలోని మోదీ సర్కార్ 2016 నుంచి 'ఉజ్వల' పథకాన్ని అమలు చేస్తోంది. గ్యాస్ కనెక్షన్లు లేని పేద కుటుంబాల్లో మహిళల పేరున కేంద్రం రూ.కోట్లు వెచ్చించి ఉచితంగా గ్యాస్ స్టవ్, సిలిండర్ అందించింది. తర్వాత సిలిండర్ కొనుగోలుపై రూ.300 వరకు రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఉజ్వల లబ్ధిదారుల ఈ-కేవైసీ చేపడితే అనర్హులను తొలగించి వారి స్థానంలో కొత్త కనెక్షన్ ఇవ్వవచ్చు అనేది కేంద్రం ఆలోచన. ఇందులో భాగంగానే గ్యాస్ ఏజెన్సీల ద్వారా వేలిముద్రల సేకరణ చాలాకాలంగా కొనసాగుతుంది. అయితే రాష్ట్రంలో రెండు నెలలుగా ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిలిచిపోయింది.

ఎలాంటి ఆదేశాలు లేవు..

వంటగ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.. గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఆ విషయాన్ని సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా లబ్ధిదారులకు చేరవేస్తాం. ఏజెన్సీ నిర్వాహకులే లబ్ధిదారుల వద్దకు వచ్చి ఈ-కేవైసీ చేసే అవకాశం ఉంది. విషయాన్ని ప్రజలు గమనించాలి.

– కొండల్‌రావు, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

ప్రచారం.. అవాస్తవం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.500కే వంటగ్యాస్ పథకానికి.. ఈకేవైసీకి ఎలాంటి సంబంధం లేదని, అనవసరంగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. గ్యాస్ వినియోగదారులు నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలన్న ప్రచారం పూర్తిగా అవాస్తమవమని అధికారులు, డీలర్లు కొట్టిపారేస్తున్నారు. ఈకేవైసీ ఎప్పుడైనా చేసుకోవచ్చు.. నిర్దిష్ట గడువేమీ లేదని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేవరకు ఈకేవైసీ కోసం ఎవరూ రావద్దని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సూచిస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్లు

- హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నేతలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు, చిత్రంలో మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని రెండు, నాలుగో వార్డు బీజేపీ కౌన్సిలర్లు రమాదేవి, పద్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి బి.పరశురాం శుక్రవారం మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇదిలా ఉండగా పార్టీలో చేరికపై ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం లేదంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ విషయాన్ని పార్టీలో చేరిన కౌన్సిలర్లు, బీజేపీ నాయకుల వద్ద ప్రస్తావించగా.. మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తొలినాళ్లలోనే అభినందించి కాంగ్రెస్‌లో చేరి కలిసి పని చేస్తామని చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సమాజంలోనూ రాణించాలి

- డీఐఈఓ జాకీర్ హుస్సేన్



మాట్లాడుతున్న డీఐఈఓ జాకీర్ హుస్సేన్

వనపర్తిటౌన్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సత్యాన్ని తెలుసుకొంటూ జీవితంలో రాణించాలని డీఐఈఓ జాకీర్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువులో రాణించేందుకు విద్యార్థులు ఎలా కష్టపడతారో.. సమాజంలో సైతం ఉన్నతంగా ఎదగాలని కోరారు. అంతకుముందు విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌సీ హవీలారాణి, మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్.జనార్దన్‌గౌడ్, మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కంది క్వింటా రూ.8,786

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.8,786, కనిష్టంగా రూ.8,401 ధర లభించింది. అలాగే వేరుశనగ క్వింటా గరిష్టంగా రూ.8,016, కనిష్టంగా రూ.5,869, వరిధాన్యం ఆర్ఎన్ఆర్ రకం క్వింటాలు గరిష్టంగా రూ.3,179, కనిష్టంగా రూ.2,239, హంస రకానికి గరిష్టంగా రూ.2,858, కనిష్టంగా రూ.1,866, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,267, కనిష్టంగా రూ.2,241 ధరలు వచ్చాయి.

300 బస్తాల ధాన్యం

దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.9,229, కనిష్టంగా రూ.8,809 ధరలు లభించాయి. అలాగే ఆర్ఎన్ఆర్ ధాన్య ం గరిష్టంగా రూ.3,069, కనిషంగా రూ.3,009 వచ్చాయి.

దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో రెండోరోజు 16,562 అర్జీలు

- కొత్తకోట, గోపాల్‌పేట మండలాల్లో పర్యటించిన అదనపు కలెక్టర్
- ఖిల్లాఘనపురంలో పర్యటించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



జిల్లాకేంద్రంలోని మర్రికుంట ప్రాథమిక పాఠశాలలో దరఖాస్తులు అందజేసేందుకు నిలబడ్డ మహిళలు

వనపర్తి: జిల్లావ్యాప్తంగా రెండోరోజు శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగాయి. అభయహస్తం దరఖాస్తులను సమర్పించేందుకు గ్రామీణులు భారీగా తరలివచ్చారు. మొదటిరోజు కంటే రెండోరోజు రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు నివేదికల్లో వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం 14 మండలాల్లోని 40 గ్రామాల్లో 10,321, ఐదు పురపాలికల్లోని 80 వార్డుల్లో 6,241 దరఖాస్తులు వచ్చినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వెల్లడించారు. ఎక్కడా దరఖాస్తు పత్రాల కొరత రానివ్వకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మండలాల వారీగా శుక్రవారం వచ్చిన దరఖాస్తులు

మండలం	గ్రామాలు	దరఖాస్తులు
ఖిల్లాఘనపురం	5	595
గోపాల్‌పేట	4	982
పెబ్బేరు	4	693
పెద్దమందడి	4	961
మదనాపురం	4	642
వనపర్తి	3	511
కొత్తకోట	3	1,625
పాన్‌గల్	3	1,317
అమరచింత	2	353
ఆత్మకూరు	2	544
వీపనగండ్ల	2	586
చిన్నంబావి	2	777
రేవల్లి	1	192
శ్రీరంగాపురం	1	543

పురపాలికల వారీగా..

మున్సిపాలిటీ	వార్డులు	దరఖాస్తులు
వనపర్తి	33	3,025
కొత్తకోట	15	2,214
పెబ్బేరు	12	985
ఆత్మకూరు	10	348
అమరచింత	10	704

హామీల అమలుకే ..



కర్ణమయ్యకుంటతండాలో దరఖాస్తు ఫారాన్ని నింపే విధానాన్ని వివరిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

కొత్తకోట/గోపాల్‌పేట: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకే ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. శుక్రవారం కొత్తకోటలోని 11, 12 వార్డులకు సంబంధించి పాత బీసీ వసతిగృహ భవనంలో, గోపాల్‌పేటలోని కర్ణమయ్యకుంటతండాలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఓపికగా దరఖాస్తులను అధికారులకు అందజేయాలని సూచించారు. దరఖాస్తు పత్రాలను తప్పులు దొర్లకుండా పూరించాలని.. దరఖాస్తులను ఎలా నింపాలో వివరించారు. కొత్తకోటలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, కర్ణమయ్యకుంటతండాలో ఎంపీడీఓ హుస్సెనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తిటౌన్/ఖిల్లాఘనపురం: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి కేవలం మాటలకే పరిమితమైందని.. క్షేత్రస్థాయిలో ఎక్కడ లేదని, ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం రెండోరోజు జిల్లాకేంద్రంలోని 10వ వార్డు నాగవరం, ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలకులు మాయమాటలతోనే కాలం వెళ్లదీశారని.. వారు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తే నేడు ఏ గ్రామానికి వెళ్లిన ఇంత పెద్దసంఖ్యలో వినతులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలు పక్కనబెట్టి అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని అందినకాడికి దోచుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తనను గెలిపించారని.. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలకుడిలా కాకుండా సేవకుడిలా పనిచేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రజాపాలన కార్యక్రమం ఎంతో దోహం పడుతుందని వివరించారు. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వనపర్తిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, కౌన్సిలర్లు జయసుధ, బ్రహ్మం, విభూది నారాయణ, లక్ష్మి, చీర్ల సత్యం, కో–ఆప్షన్ సభ్యుడు ఖైరున్ షఫీ, సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఖిల్లాఘనపురం మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ పాండునాయక్, ఏఓ మల్లయ్య పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, ఎంపీఓ రాజు, ఉపాధిహామీ అధికారి సత్యనారాయణ, సర్పంచులు గిరమ్మ, అనెమోని కృష్ణవేణి, గోపాల్‌నాయక్, పీన్యానాయక్, నరేష్‌నాయక్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని గంట్రావ్‌పల్లి స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల వివరాల మేరకు.. గంట్రావ్‌పల్లికి చెందిన చొక్కపల్లి మల్లేష్ (40) సాతాపూర్‌లో బైక్ మరమ్మతు చేయించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా, గంట్రావ్‌పల్లి స్టేజీ వద్ద మాటువేసిన గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై కత్తులతో దాడిచేసి హతమార్చారు. మృతుడికి తండ్రి బాలస్వామి, తల్లి బాలమ్మ, భార్య నిర్మల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా తన దాయాదుల మధ్య పొలం విషయంలో గొడవలు ఉన్నాయని తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బొలెరో, బైక్ ఢీ: యువకుడి దుర్మరణం

తాడూరు: బొలెరో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని గుంతకోడూరు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నవీన్ (25) అనే యువకుడు తాడూరు నుంచి కల్వకుర్తికి బైక్‌పై వెళ్తుండగా, గుంతకోడూరు సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బైక్‌పై నుంచి పడి మరో వ్యక్తి..

శాంతినగర్: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడు శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల మేరకు.. మానవపాడుకు చెందిన మద్దిలేటి (50) శుక్రవారం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై శాంతినగర్‌కు వచ్చి వెళ్తుండగా.. పైపాడు శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి బలవన్మరణం

హన్వాడ: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హన్వాడ మండలం టంకరలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. టంకరకు చెందిన రమేష్‌గౌడ్ (48) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పొలానికి వెళ్లిన అతడికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో అక్కడే ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన సమీప పొలాల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందు తూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం/ఉప్పునుంతల: మహిళ ఆత్మహత్యకు కారణమైన ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ 20వేల జరిమానా విధిస్తూ నాగర్‌కర్నూల్ కోర్టు జడ్జి సబిత తీర్పు ఇచ్చారు. ఏఎస్పీ రామేశ్వర్ వివరాల మేరకు.. బల్మూరు మండలం మంగళికుంటపల్లికి చెందిన మహేష్.. ఉప్పునుంతలకు చెందిన అనూష (22)కు మాయమాటలు చెప్పి రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి వివాహం విషయం అనూషకు తెలియడంతో ఇరువురి కుటుంబాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో తన వెంట తీసుకెళ్లేందుకు మహేష్ నిరాకరించడంతో మనస్తాపానికి గురైన అనూష.. 2021 సెప్టెంబర్ 13న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి సుగుణమ్మ ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో మహేష్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా వాదించిన అడిషనల్ పీపీ భవానీబాయితో పాటు అచ్చంపేట సర్కిల్ లైసన్ ఆఫీసర్ వినయ్, కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణలను అదనపు ఎస్పీఅభినందించారు.

మరో కేసులో రెండున్నరేళ్ల జైలు

మహబూబ్‌నగర్ క్రైం: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు రెండున్నరేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలం చెన్నావెల్లికి చెందిన మహ్మద్ ఇబ్రహీం కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై అతడి భార్య ఫర్జానాబేగాన్ని శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. దీంతో మనస్తాపానికి గురైన ఫర్జానాబేగం 2018 జూన్ 12న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో మహ్మద్ ఇబ్రహీంకు రెండున్నరేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ వాదనాలు వినిపించారు.

ఆధార్.. బేజార్

టోకెన్ల కోసం ఆధార్ సెంటర్ వద్దే నిద్ర

ఆధార్ నమోదు.. అప్‌డేట్ జనాన్ని బేజారెత్తిస్తోంది. ఓవైపు ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు తీసుకోవడం.. మరోవైపు ఆధార్‌లో తప్పులను సరిచేసేందుకు సమయం లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ఆధార్‌లో చిరునామా మార్పు, తప్పులను సరిచేయడం, పిల్లలకు ఆధార్ నమోదు చేయించేందుకుగాను సంబంధిత కేంద్రాలకు పోటెత్తుతున్నారు. ఏ కేంద్రానికి వెళ్లి చూసినా జాతరను తలపిస్తోంది. కొన్ని సెంటర్లలో పరిమిత సంఖ్యలో టోకెన్లు ఇస్తున్నారు. ఈ క్రమంలో గద్వాల జిల్లా కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రాలకు గ్రామీణ ప్రాంత ప్రజలు బారులు తీరుతున్నారు. బీరెల్లి రోడ్డులోని ఆధార్ సెంటర్ వద్ద టోకెన్ల కోసం అర్ధరాత్రి నుంచే క్యూకట్టారు. కొందరు దుప్పట్లు తెచ్చుకొని మరీ ఇక్కడే నిద్రించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ఆధార్ సెంటర్ వద్ద తెల్లవారుజామున 3గంటలకు గజగజ వణికించే చలిలో చంటి పిల్లలతో కలిసి క్యూకట్టారు. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– గద్వాల అర్బన్



గద్వాల మున్సిపాలిటీ వద్ద తెల్లవారుజామున 3గంటలకు ఇలా..



మున్సిపాలిటీలోని ఆధార్ సెంటర్ వద్ద చంటి పిల్లలతో తల్లుల పడిగాపులు



జిల్లా కేంద్రంలో బీరెల్లి రోడ్డులోని ఆధార్ సెంటర్ వద్ద..

చిన్నరాజమూరయ్యకు పల్లకీసేవ

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. కొందరు భక్తులు దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు పొర్లుదండాలు పెట్టారు. అదేవిధంగా స్వామివారికి ఆవులు, కోడెదూడలను సమర్పించుకున్నారు. రాత్రి స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

పడమటి అంజన్నకు కల్పవృక్ష వాహనసేవ

మక్తల్: మక్తల్ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్పవృక్ష వాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్న రథంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారికి కల్పవృక్ష వాహనసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు వెన్నచర్ల ఉపాధ్యాయుడు



రాజశేఖరరావును అభినందిస్తున్న డీఈఓ

కందనూలు: ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ – 2023కు పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖరరావు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాజశేఖరరావును డీఈఓ గోవిందరాజులు ప్రత్యేకంగా అభినందించారు. వచ్చేనెల 17నుంచి 20వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ డీబీటీ, టీహెచ్‌ఎస్‌టీఐ, ఆర్‌సీబీ క్యాంపస్‌లో నిర్వహించనున్న ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని.. సైన్స్ ఫెస్టివల్‌కు రాజశేఖరరావు ఎంపిక కావడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, సెక్టోరియల్ అధికారి షర్ఫుద్దీన్, స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వర్ల శెట్టి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు: అక్రమంగా ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనందం వివరాల మేరకు.. మద్దూరుకు చెందిన చంద్రశేఖర్ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 32 క్వింటాళ్ల (80 బస్తాలు) బియ్యాన్ని సీజ్ చేసి, మద్దూరు రేషన్ షాప్ నంబర్–3 డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు. చంద్రశేఖర్‌పై 6–ఏ కేసుతో పాటు పోలీసు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



మద్దూరులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనందం

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్పంచ్ హఠాన్మరణం



రాజు (ఫైల్)

మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంగంబండ గ్రామ సర్పంచ్ రాజు (40) గుండెపోటుతో మృతి చెందారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఛాతీలో నొప్పి వస్తుందని ఇంటికి వెళ్తున్న క్రమంలో కుప్పకూలారు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మక్తల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందారు. సర్పంచ్ రాజు మృతితో సంగంబండలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డితో పాటు ప్రజాపాలన ప్రత్యేకాధికారి జాన్‌సుధాకర్, ఎంపీడీఓ సద్గుణ సర్పంచ్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రేపు శ్రీరామ పూజిత అక్షతల శోభాయాత్ర



మాట్లాడుతున్న వసంతం వెంకటేశ్

స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్యలో శ్రీరాముడిని పూజించిన అక్షతల శోభాయాత్ర ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర జిల్లా సంయోజక్ వసంతం వెంకటేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవ్యమైన మందిర నిర్మాణం పూర్తయ్యి బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ శుభ సందర్భంలో శ్రీరాముని పూజిత అక్షతలను గడప గడపకూ చేర్చడానికి శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఉదయం 9.30 గంటలకు తూర్పు కమాన్ సీతారామాంజనేయస్వామి ఆలయం నుంచి అక్షతల శోభాయాత్ర ప్రారంభమై రాంమందిర్ చౌరస్తా, ఆకుల చౌరస్తా, గడియారం చౌరస్తా, అశోక్‌టాకీస్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఈ అక్షతలను కాలనీలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చేనెల 1 నుంచి 15 వరకు రామభక్తులు ప్రతి ఇంటికి వచ్చి రాములవారి అక్షత, రామ మందిరం ఫొటో, కరపత్రం అందజేస్తారన్నారు. వీటిని పూజా మందిరంలో పెట్టుకొని 22న మధ్యాహ్నం 12.15 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఇంట్లో ఉన్న అక్షతలను తలపై వేసుకొని శ్రీరాముని ఆశీస్సులు పొందాలని సూచించారు. అదే రోజు సాయంత్రం ఇళ్లను దీపాలతో అలంకరించుకొని సర్వ దేవతలను స్మరించుకోవాలని కోరారు. శోభాయాత్రలో హైందవ భక్తులు, ధార్మిక సంస్థలు, అన్ని కుల, భజన మండళ్ల పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా నృత్యోత్సవం



మెమొంటోలు అందుకున్న విద్యార్థులతో డాన్స్ మాస్టర్లు



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ధూమ్ డాన్స్ స్టూడియో, టీటీడీఏ ఆధ్వర్యంలో నృత్యోత్సవం నిర్వహించారు. ఓపెన్ విభాగం సోలో, డ్యూయల్, గ్రూపు విభాగాల్లో డ్యాన్స్ పోటీలు నిర్వహించగా.. పలు ప్రాంతాలకు చెందిన డాన్స్ అకాడమీల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చిన్నారులు, యువత ప్రదర్శించిన సోలో, వెస్ట్రన్, క్లాసికల్ డాన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. డాన్స్ పోటీలకు దాదాపు 400 మంది చిన్నారులు, యువత పాల్గొన్నట్లు ధూమ్ డాన్స్ స్టూడియో డైరెక్టర్ అబ్దుల్ అజీమ్ తెలిపారు. మాస్టర్ రమేష్, కొరియోగ్రాఫర్ తాజుద్దీన్, కూచిపుడి డాన్స్ మాస్టర్ వైష్ణవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. అనంతరం 150మంది డాన్సర్లను మెమెంటోలు అందజేసి సత్కరించారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సినీ కొరియోగ్రాఫర్ సత్య మాస్టర్ బహుమతులను ప్రదానం చేశారు.

ఆలిండియా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రియాంక



మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం కేశ్వాపూర్ పెద్దతండాకు చెందిన కె.ప్రియాంక ఆలిండియా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల బెంగళూర్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నీలో చెన్నైలోని హిందూస్తాన్ యూనివర్సిటీ తరపున ప్రియాంక పాల్గొని ప్రతిభ చాటింది. ఆమెను వచ్చేనెల 6వ తేదీ నుంచి హర్యానాలో నిర్వహించనున్న ఆలిండియా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ఎండీ ఖలీల్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

జోగుళాంబ సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ సిబ్బంది సాదర స్వాగతం పలికి, ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య ఆచారి, బ్రహ్మయ్య, రికార్డు అసిస్టెంట్ ప్రదీప్, శ్రీకాంత్, గోపి పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి రామన్‌పాడుకు 325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

70 బస్తాల ధాన్యం చోరీ

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లిలో గుర్తుతెలియని దుండగులు 70 బస్తాల ధాన్యాన్ని చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యాన్ని తరలించే వరకు సదరు రైతులు బాధ్యులుగా ఉంటారు. ముమ్మళ్లపల్లి కొనుగోలు కేంద్రంలో రైతు రమేష్ ధాన్యాన్ని తూకం చేయగా.. బస్తాలపై కవర్ కప్పి రోజు కాపలా కాసేవాడు. శుక్రవారం ఉదయం ధాన్యం బస్తాలపై కప్పిన కవర్ తెరుచుకుని ఉండటంతో ఆందోళనకు గురై పూర్తిగా కవర్ తొలగించి చూడగా.. 72 బస్తాల ధాన్య చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

జాతరలో మద్యం విక్రయాలపై దాడులు

వనపర్తి: జిల్లా కేంద్రంలోని రాజనగరం రామకృష్ణేశ్వర స్వామి జాతరలో మద్యం అక్రమ విక్రయాలపై శుక్రవారం రూరల్ పోలీసులు దాడులు చేశారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎస్‌ఐ నాగన్న సిబ్బందితో కలిసి మద్యం షాపులపై దాడులు నిర్వహించి 19.91 లీటర్ల మద్యం సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు జూనియర్ కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం జిల్లా జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్ కార్డుతో స్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు. ఎంపికైన జట్లు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో వచ్చేనెల 11 నుంచి 14 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. మిగతా వివరాల కోసం 97049 34663 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

పాలమూరు: న్యాయవాది సోమిరెడ్డి లక్ష్మారెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కోర్టు నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి లక్ష్మారెడ్డిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారికి బెయిల్ ఇప్పించరాదని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు.

పొగమంచుతో ప్రమాదం





ప్రమాదానికి గురైన వాహనాలు

ఎన్‌హెచ్–44పై ఒకదాన్ని వెంట ఒకటి ఐదు వాహనాలు ఢీ

బాలానగర్: పొగమంచు కారణంగా ఓ లారీని డీసీఎం, డీసీఎంను కారు.. ఇలా ఐదు వాహనాలు ఒకదాన్ని వెంట ఒకటి ఢీకొన్న ఘటన శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉదయం 9:30 గంటల ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా హైదరాబాద్‌వైపు వెళ్తున్న లారీని గమనించని ఓ డీసీఎం డ్రైవర్ ఢీకొట్టి, రోడ్డుపైనే వాహనం నిలిపివేశాడు. ఈ క్రమంలో వెనుకాలే వస్తున్న మరో కారు డీసీఎంను ఢీకొట్టింది. ఇలా మరో మూడు కార్లు ఒకదాన్ని వెంట ఒకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో మూడు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు యజమాని బంటుసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నయా మోసం

ఇండియన్ గ్యాస్ కనెక్షన్ చెకప్ పేరుతో బురిడీ

ధన్వాడ: ఇండియన్ గ్యాస్ కనెక్షన్ చెకప్ పేరుతో కొందరు కేడీలు నయా మోసానికి తెరలేపారు. గ్యాస్ కనెక్షన్ చెకప్ చేసేందుకుగాను రూ.236 చొప్పున వసూలు చేసి వినియోగదారులను బురిడీ కొట్టించారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఇండియన్ గ్యాస్ కనెక్షన్ చెకప్ పేరుతో బుధవారం ఆరుగురు వ్యక్తులు వినియోగదారుల ఇళ్లకు వెళ్లారు. ప్రతి సంవత్సరం గ్యాస్ కనెక్షన్ చెకప్ చేసుకోవాల్సి ఉంటుందని.. ఇందుకుగాను రూ.236 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. గ్యాస్ కనెక్షన్ చెకప్ చేయించుకోకపోతే సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. వీరి మాటలు నమ్మిన కొందరు వినియోగదారులు.. గ్యాస్ కనెక్షన్ చెకప్ కోసం రూ.236 చొప్పున చెల్లించారు. గ్రామంలో మొత్తం 300 కనెక్షన్లు ఉండగా.. 200 మంది నుంచి దాదాపు రూ.50వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొందరికి అనుమానం వచ్చి గురువారం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించగా.. తాము ఎలాంటి చెకప్‌లు చేయడంలేదని తెలిపారు. తమ కార్యాలయంలోనే సిలిండర్‌ను పూర్తి స్థాయిలో చెక్‌చేసి, వినియోగదారులకు అందజేస్తామని తెలియజేశారు. కాగా గ్యాస్ కనెక్షన్ చెకప్ పేరుతో డబ్బులు వసూలు చేసిన దుండగులు.. అందుకు సంబంధించిన రసీదులు ఇవ్వడం గమనార్హం. ఏదేమైనప్పటికీ రోజురోజుకు కొత్త కొత్త మోసాలు వెలుగు చూస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత సమాజంలో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- ఆరుగురిపై కేసు నమోదు

ఉప్పునుంతల: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని తాడూరుకు చెందిన అర్థం భవానిని అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసిన అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. తాడూరుకు చెందిన భవాని, బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లికి చెందిన అర్థం కోటేశ్వర్‌కు ఐదేళ్ల కిందట వివాహమైంది. వివాహ సమయంలో రూ.20లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. కొన్ని రోజుల తర్వాత భవానికి బాబు పుట్టి చనిపోయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురైన ఆమె ఆరోగ్యం క్షీణించింది. అప్పటి నుంచి తన భర్త కోటేశ్వర్, అతడి తల్లి భాగ్యమ్మ, ఆడపడచులు జగతమ్మ, అనసూయ, శ్రీదేవి, జ్యోతి అదనపు కట్నం కోసం భవానిని వేధింపులకు పాల్పడటంతో పాటు 4 నెలల కిందట ఇంటి నుంచి గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

32 మందిపై కేసులు నమోదు

గద్వాల క్రైం: మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా పోలీస్‌శాఖ విధించిన 144 సెక్షన్ నిబంధనలను ఉల్లఘించిన 32 మందిపై మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ రితిరాజ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా అనుమతి లేకుండా జంతుబల ప్రదర్శన (బండలాగుడు) పోటీలు నిర్వహించరాదని ఆర్డీఓ 144 సెక్షన్ అమలు చేసినట్లు పేర్కొన్నారు. పోటీల నిర్వహణ క్రమంలో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతారని గుర్తించి చర్యలు చేపట్టారన్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా నాయకుల ప్రోద్బలంతో గురువారం పోటీల నిర్వహణ చేపట్టి ప్రజలు, భక్తులకు అసౌకర్యం కల్పించడంతో పాటు రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించినట్లు తెలిపారు. దీంతో బండలాగుడు పోటీలు నిర్వహించిన 23 మందితో పాటు రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలిగించిన 9మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.